కాలనీలు కళకళ

- 28వ వార్డులో రూ.2.5 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- ఇప్పటికే రూ.1.7 కోట్ల పనులు పూర్తి
- శరవేగంగా మరో రూ.80 లక్షల పనులు



నెహ్రూనగర్‌లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం

బీచ్ రోడ్డు: ఆ కాలనీలకు గత పదిహేళ్లుగా నడిచేందుకు సరైన మార్గం లేదు. వాహనాలతో వెళ్లాలంటే సర్కస్ చేయాల్సి వచ్చేది. అటువంటి కాలనీలు ఇప్పుడు అందమైన రోడ్లు, డ్రైనేజీలతో కళకళలాడుతున్నాయి. అవి నగరం నడిబొడ్డిన ఉన్న జీవీఎంసీ 28వ వార్డులో ఉన్న సంతోషమాత కాలనీ, రామ్‌నగర్, భానోజీనగర్, జేఎస్‌ఎం కాలనీలే. ఈ ప్రాంతాలలో రోడ్లు శిథిలావస్థకు చేరి 10 ఏళ్లు అవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఇప్పుడు ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.5 కోట్లు కేటాయించింది. వీటిలో రూ.1.7 కోట్ల పనులు పూర్తి కాగా.. మరో రూ. 80 లక్షల పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రామ్‌నగర్‌లో రూ.45 లక్షలతో కల్వర్ట్ పనులు

జీవీఎంసీ రూ.1.5 కోట్ల మంజూరు

28వ వార్డు అభివృద్ధికి జీవీఎంసీ రూ.1.5 కోట్లు కేటాయించింది. వీటితో భానోజీనగర్ రెల్లి వీధి కాలనీ సీసీ రోడ్డుకు రూ.20 లక్షలు, రామ్‌నగర్ రోడ్డు మరమ్మతులకు రూ.32 లక్షలు, రామ్‌నగర్ బజార్ వద్ద కల్వర్ట్ నిర్మాణానికి రూ.45 లక్షలు, సంతోషిమాత కాలనీ సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ.35 లక్షలు, వాటర్ ఫౌంటైన్ల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. వీటిలో కల్వర్ట్ పనులు శరవేగంగా కొనసాగతుండగా, మిగతా పనులు పూర్తయ్యాయి.

గడపగడపకు మన ప్రభుత్వం కింద రూ.కోటి విడుదల

గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు చెప్పిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూ. కోటి మంజూరీ చేసింది. వీటిలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టారు. మరో రూ.80 లక్షల్లో రూ.42 లక్షలతో ఓపెన్ డ్రైనేజీని నిర్మించారు. రూ. 38 లక్షలతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఇది కదా అభివృద్ధి



రామ్‌నగర్‌లో పూర్తయిన రోడ్డు నిర్మాణం



తుదిదశకు చేరుకున్న యూజీడీ పనులు

వార్డులో అభివృద్ధి పరుగులు



గతంలో మా వార్డులోని కాలనీలను పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గడపగడపకు వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అలా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేశారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సొంత నిధులతో సామాజిక భవనాల మరమ్మతులు చేపట్టారు.

– బి.నాగరాజు, రామ్‌నగర్

ఏళ్ల నాటి సమస్యకు విముక్తి..



ఎన్నో ఏళ్లుగా మా కాలనీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా కాలనీకి రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు. ఎట్టకేలకు మా సమస్యలకు విముక్తి కలిగింది. మాకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా మా కార్పొరేటర్‌కు చెబితే వెంటనే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నారు.

– సీహెచ్.నరసింహారావు, జీఎస్‌ఎం కాలనీ

క్లుప్తంగా

గవర్నర్‌కు స్వాగతం



గవర్నర్‌ని స్వాగతిస్తున్న వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ని ఏయూ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన గవర్నర్‌కు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్‌లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కొత్త పద్ధతుల్లో పాఠ్య బోధన అవసరం



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని 19 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం సమావేశం నిర్వహించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యా శాఖాధికారి సీహెచ్.రవీంద్ర బాబు మాట్లాడుతూ ఎన్‌ఈపీ–2020 ప్రకారం కొత్త పద్ధతుల్లో పాఠ్యాంశాల బోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ దుర్గాభవాని, కార్యదర్శి వి.విశ్వనాథం, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ రాజగోపురానికి మరమ్మతులు



రాట కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు పోలమాంబ ఆలయ రాజగోపురం మరమ్మతులకు గురువారం శ్రీకారం చుట్టారు. నగరానికి చెందిన సిరిమల్ల వెంకటేష్, రాధారాణి దంపతులు రాజగోపురానికి పెయింటింగ్, గోపురంపై విగ్రహాలకు మరమ్మతులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు పనులను గురువారం రాట వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.గాయత్రి, ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకరరావు, సభ్యులు మాదు మంగరాజు, నీలాపు నైటమ్మ, నండూరి కృష్ణమోహన్, మరడ నాగమణి, మారెడ్ల సత్య వెంకట రమణమ్మ, బిడుమూరి భారతి, అర్చకులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మొల్లి అప్పారావు, పీతల గోవింద్

బీచ్ రోడ్డు: నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. గోవింద్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



విశాఖ వ్యాలీలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సతీమణి డాక్టర్ నిహారిక



డంబెల్స్‌తో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో గురువారం స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగింది. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఇక్కడ జరగనున్న ఈ స్పోర్ట్స్ మీట్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సతీమణి డాక్టర్ నిహారిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. టార్చ్ బేరర్ చూపుతూ బెలూన్లు, శాంతి కపోతాలు గాలిలో ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ మీట్‌లో సుమారు 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలి రోజు యోగా, ట్రాక్ ఈవెంట్లు, తైక్వాండో, అథ్లెటిక్స్, హూలా హూప్స్, జుంబా, డంబెల్స్, బాంగ్రా, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారికా మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహం, క్రీడా స్ఫూర్తిని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి తిరుప్పావడ సేవ



గజ వాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి



తిరుప్పావడ సేవలో వెంకన్న

ఎంవీపీ కాలనీ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న స్వామి వారి ఎదుట పులిహోర కుప్పగా పోసి, వడలు నివేదించారు. అనంతరం నిత్యాగోష్టిలో పాల్గొన్న భక్తులందరికీ వడలు, పులిహోర, దద్దోజనం, పొంగలి ప్రసాదం అందజేశారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా శ్రీభూనీలా సహిత శ్రీనివాసుడు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దేవేరులతో తిరువీధి వేడుకలో స్వామి వారు ఎంవీపీ కాలనీ సెక్టార్–6, సెక్టార్–2, సెక్టార్–3 వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దారి పొడవునా స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని ఆశీస్సులు తీసుకున్నారు.

రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



కొండమ్మకు రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహకారం అందింది. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలికి చెందిన కొండమ్మ కుమారుడు హరీష్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అక్కరమాని రోహిణి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేశారు. హరీష్ ఆరోగ్య పరిస్థితిని రిపోర్టుల ద్వారా పరిశీలించిన అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 లక్షలు మంజూరైంది. ఈ మేరకు ఆ చెక్కును గురువారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి కొండమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఎ.రాజబాబు, వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, బోని శివరామకృష్ణ పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



మద్దిలపాలెంలో ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

మద్దిలపాలెం: మద్దిలపాలెం కూడలి నుంచి ఇసుకతోట వరకు గురువారం రాత్రి ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఇటు మద్దిలపాలెం కూడలి వైపు వస్తుండడంతో అదే సమయంలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలను నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీసులు చొరవ తీసుకున్నారు. ఆ సమయంలో మద్దిలపాలెం వైపు వెళ్లే వాహనాలు ఇసుకతోట సిగ్నల్ వరకూ నిలిచిపోయాయి. దీంతో వాహనచోదకులు సర్వీసు రోడ్లను ఆశ్రయించడంతో పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్డు వాహనాలతో కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్ అంతరాయం కారణంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల రోడ్డు గుండా రాకపోకలు సాగించే వాహనాలు, ఇటూ మద్దిలపాలెం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు చొరవ తీసుకుని వాహనాలను క్రమబద్ధీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం డ్రా తీశారు. 88 మంది ఉదయం బజార్ కార్డుదారులకు 66 స్టాళ్లు, సాయంత్రం కార్డుదారులకు 59 స్టాళ్లు కేటాయించారు. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో రైతులకు స్టాల్ టోకెన్లు అందజేశారు. ఈవో మట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని సీతమ్మధారకు చెందిన ఎం.విమల అనేదాత రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్ అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన



మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు అన్నారు. గురువారం జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ సచివాలయం పరిధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అప్పారావు సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పరిపాలన కోసం వివరించారు. మంచి పరిపాలన కొనసాగాలంటే మళ్లీ సీఎం జగన్‌కే మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ ముvvల లక్ష్మి, పార్టీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.


శ్మశానవాటికకు మరమ్మతులు



శ్మశానవాటికకు మరమ్మతులు చేస్తున్న గ్రామ సేవా సంఘం సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులోని శ్మశానవాటిక మరమ్మతు పనులు పాత వెంకోజీపాలెం శ్రీసీతారామా సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. శ్మశానవాటిక షెడ్డు, చుట్టూ ఫ్లోరింగ్, మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు.

పద్య సాహిత్యం అవసరం



మాట్లాడుతున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

సీతంపేట: ప్రసన్నభారతి ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సాహిత్య సభ జరిగింది. ప్రసన్నభారతి అధ్యక్షుడు ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజాంకు చెందిన గార రంగనాథం రచించిన 'రాయరత్న మంజూష' విమర్శ గ్రంథానికి, పాల్వంచకు చెందిన అచ్యుతానంద బ్రహ్మచారి రచించిన 'సాందీపని చరిత్ర' పద్యకావ్యానికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ భావితరాలకు తెలుగు భాష సంప్రదాయ సాహిత్యాన్ని, విలువలను అందజేస్తున్న ప్రసన్నభారతి కృషిని ప్రస్తావించారు. రచయితలు డి.వి.సూర్యారావు, బులుసు వెంకటేశ్వర్లు, ప్రసన్న భారతి కార్యదర్శి సర్వేశ్వర ప్రసాద్ పద్య సాహిత్యం వైభవాన్ని, పద్య సాహిత్యాన్ని నిలబెట్టాల్సిన అవసరాన్ని వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర



11వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే నియోజకవర్గంలో గడపగడపకు పాదయాత్ర చేపట్టినట్లు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 11వ వార్డులో గురువారం పాదయాత్ర ప్రారంభించారు. టీబీసీ పాయింట్ వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర క్రాంతినగర్, అంబేడ్కర్‌నగర్, ముస్తఫా కాలనీ వరకు సాగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లారు. మహిళలు, యువకులు, వృద్ధును పలకరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఏవిధంగా లబ్ధిపొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. ఆయా కాలనీలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం జరుగుతున్నాయన్నారు. పాదయాత్రలో తన దృష్టికి వస్తున్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపలి రాజబాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహన్‌రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



రమ్యకు డబ్బులు అందిస్తున్న డీసీపీ వెంకటరత్నం

ఆరిలోవ: ఆటోలో మరిచిపోయిన బ్యాగును బాధిత మహిళకు అందజేసి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఆరిలోవ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 25న విమ్స్ ఆస్పత్రి వద్ద జి.రమ్య, తల్లిదండ్రులతో కలిసి ఆటో ఎక్కి ఆరిలోవలో బాలాజీనగర్ వద్ద దిగారు. ఆ సమయంలో తమ వెంట తీసుకొచ్చిన రూ.45 వేలు నగదుతో ఉన్న బ్యాగును ఆటో మరిచిపోయి దిగిపోయారు. ఇంటికి వెళ్లిన అనంతరం చూసేసరికి డబ్బులు ఉండే బ్యాగు కనిపించకపోవడంతో వెంటనే ఆరిలోవ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలాజీనగర్ వద్ద ఉన్న 25వ తేదీకి సంబంధించిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆటోను గుర్తించారు. టీబీసీ పాయింట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కే మస్తాన్ నిజాయితీగా ఆటోలో తనకు దొరికిన రూ.45 వేలు నగదును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో గురువారం క్రైం డీసీపీ పి.వెంకటరత్నం బాధితురాలు రమ్యను పిలిపించి నగదు అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన మస్తాన్‌ను అభినందించి, ఆరిలోవ క్రైం పోలీసులకు బాధిత మహిళ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకా క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్ పనులు



పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక షాపులు

సింహాచలం: సింహగిరిపై తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రసాద్ స్కీమ్ పథకంలో భాగంగా సింహగిరిపై కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. దీంతో ప్రసుత్తం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ని ఇటీవల దేవస్థానం అధికారులు తొలగించారు. కొత్త షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి వచ్చే వరకు ప్రత్యామ్నాయంగా తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్‌ని పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల సముదాయంలో దేవస్థానం అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు వారం రోజుల నుంచి సాగుతున్నాయి. మొత్తం 64 దుకాణాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే జనవరి 3వ తేదీ నుంచి విజయవాడ కనకదుర్గ దేవస్థానంలో ప్రారంభమయ్యే చండీ సందర్భంగా సింహగిరికి కూడా అధిక సంఖ్యలో దీక్షాధారులు వస్తారు. అలాగే శబరిమలైలో జ్యోతికి వెళ్లే అయ్యప్ప భక్తులు కూడా సింహగిరికి అధిక సంఖ్యలో రానున్నారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని త్వరగా షాపులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు దేవస్థానం అధికారులు ప్రయత్నిస్తున్నారు. తాత్కాలిక షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తికి, ఇంజినీరింగ్ అధికారులకు సింహగిరి వర్తకుల సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆసక్తికరంగా మాక్ పార్లమెంట్

సీతంపేట: డాక్టర్ బుల్లయ్య కళాశాల క్యాంపస్‌లో బీఏ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. విద్యార్థినీ విద్యార్థులు అధికార, ప్రతిపక్ష సభ్యులుగా వ్యవహరించి అసలైన పార్లమెంట్‌లో చర్చా కార్యక్రమాలు ఎలా జరుగుతాయో కళ్లకు కట్టినట్టు ఆసక్తికరంగా చూపారు. బీఏ విద్యార్థులు డి.శ్రీనిధి స్పీకర్‌గా, కె.కుసుమ డిప్యూటీ స్పీకర్‌గా, ఎం.రుక్సార్ బేగం ప్రధాన మంత్రిగా వ్యవహరించగా.. ఎం.నిఖిత, బి.జగదీష్, కె.వి. సాత్విక్, టి.హర్ష శాంతిచంద్ర ప్రతిపక్ష పార్టీ ప్రతినిధులుగా పాల్గొన్నారు. అధికార పార్టీ చంద్రయాన్–3 విజయాన్ని ప్రశంసించడంతో సభ ప్రారంభమైంది. తర్వాత ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు, భారత ఎక్సైజ్ పాలసీ, భారత్ కెనడా సంబంధాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ జి.ఎ స్.కె.చక్రవర్తి, ఆర్‌వీహెచ్ శ్రీకాంత్, సాంఘిక శాస్త్ర విభాగాధిపతి జె.లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.